క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధిత మరమ్మతు పనుల కారణంగా చంపాపేట, లక్ష్మీనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లక్ష్మీనగర్, వినయ్ నగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని కృష్ణానగర్, బాలాజీనగర్, రెడ్డి కాలనీ, చంపాపేట, సాయిబాబా మందిరం పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ అన్నారు.

ఎల్బీనగర్ ఏసీపీ జానకిరెడ్డికి శుభాకాంక్షలు



ఏసీపీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉపేందర్‌రెడ్డి

నాగోలు: ఎల్బీనగర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన జానకి రెడ్డిని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుకు ఉపేందర్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముచ్చర్ల కృష్ణ, తలాటి రమేష్ నేత, వంగాల శ్రీకాంత్ రెడ్డి, టైగర్ శివ, కాళిదాస్, విప్లవ్, మాచర్ల వరుణ్, నాగేష్, ఖలీద్ భాయ్, శేఖర్ బాబు, శివ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



ఆర్‌కేపురంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: దివ్యాంగుల పెన్షన్‌ను వెయ్యి రూపాయలు పెంచినందుకు ఆదివారం ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌కేపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, మహేశ్వరం నియోజకవర్గ జనరల్ సెక్రటరీ మురుకుంట్ల అరవింద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దుబ్బాక శేఖర్, నాయకులు రామాచారి, నేలకొండ శ్రీనివాసరెడ్డి, కంచర్ల శేఖర్, దేవేందర్, అల్లావుద్దీన్ పటేల్, ఫరీద్ పాషా వాజిద్ పటేల్, శంకర్ నాయక్, శ్రీరాములు, వనం వేణు, మహేష్ గౌడ్ బండారి మల్లేష్ ముదిరాజ్, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

చాణక్యపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని చాణక్యపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోమ భాస్కర్‌గుప్తా, ఉపాధ్యక్షుడిగా ఎం. శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, జాయింట్ సెక్రటరీగా చంద్రశేఖర్, కోశాధికారిగా రఘునాథ్‌రెడ్డి, సలహాదారులుగా సి.నర్సింహారెడ్డి, ఎన్ మాధవరెడ్డి, వి.మధుసూదర్‌రెడ్డిలను ఎన్నికున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు

మన్సూరాబాద్: భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ వేడుకలను ఆటోనగర్ పారిశ్రామికవాడలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే యాజమాన్యాలతో చర్చించి పరిష్కరిస్తానని తెలిపారు. కార్మికులకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి కార్మికుల హక్కులను రక్షిస్తానని స్పష్టం చేశారు. తెలంగాణ హమాలీ సంఘం ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, జనార్ధన్‌రెడ్డి, నాగరాజు, కొండల్‌రెడ్డి, వెంకటయ్య, మల్లేష్, చంద్రయ్య పాల్గొన్నారు.

ఘనం... బోనం

ఎల్బీనగర్ నియోజకవర్గంలో వైభవంగా బోనాల ఉత్సవాలు





మన్సూరాబాద్ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో .. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



బోనంతో నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ

ఎల్బీనగర్: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం బోనాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రాలను ధరించి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాలను ఉత్సవ నిర్వాహకులు పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాటు చేశారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పలు డివిజన్లలో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.
- బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో నిర్వహించిన బోనాల జాతరలో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొన్నారు.
- సాహెబ్‌నగ్ బతుకమ్మకుంటలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ముద్దగౌని చంద్రకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఎల్బీనగర్ డీసీపీ సాయి శ్రీ పాల్గొని పూజలు చేశారు.



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం



చంపాపేటలో అమ్మవారికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ అధ్యక్షుడు ముద్దగౌని సతీష్ గౌడ్ బీఎన్‌రెడ్డినగర్‌లోని ఆలయాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.
- బోనాల సందర్భంగా నాగోలు సాయినగర్‌లోని మైశమ్మ పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఎల్బీనగర్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి ముద్దగౌని రాంమోహన్‌గౌడ్ పాల్గొన్నారు.
- నాగోలు నవచైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ, మహంకాళీ బోనాల వేడుకల్లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు యెగ్గే మల్లేశం, దయానంద్‌గుప్తా, స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ పాల్గొన్నారు.



బీఎన్‌రెడ్డినగర్‌లో.. బీసీ సంక్షేమ సంఘం నాయకుడు సతీష్ గౌడ్



సాహెబ్‌నగర్‌లో.. డీసీపీ సాయిశ్రీని సన్మానిస్తున్న నిర్వాహకుడు చంద్రకాంత్‌గౌడ్

ఎన్టీఆర్ నగర్‌లో...

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని బీరప్ప ఆలయం వద్ద ఆదివారం కురుమ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.కురుమ సంఘం పెద్దలు చంద్రయ్య, ఐలయ్య, నర్సింహ, మస్న రవి కుమార్,తలాటి, రమేష్, మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, శ్రావణ్ కురుమ తదితరులు పాల్గొన్నారు.



బీరప్ప ఆలయం వద్ద డోలు వాయిస్తున్న కాంగ్రెస్ నేతలు దేప భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి



లింగోజిగూడలో ... ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రావు



నాగోలులో పాల్గొన్న బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్



నాగోలులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు



బీఎన్‌రెడ్డినగర్‌లో అమ్మవారికి బోనం సమర్పిస్తున్న మహిళలు



నాగోలులో...ఉప్పల శ్రీనివాస్‌గుప్తాకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



అభివాదం చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు

లింగోజిగూడ: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి మహాసభను జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీనగర్‌లోని శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమంలో, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. చాలీచాలని జీతాలతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు సరిగ్గా అందక, వయస్సు మీద పడటంతో మరో పని చేయలేక, పని ఒత్తిడి కారణంగా ఎంతో మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న, విధుల్లో ఉండగా చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే సీఎం కేసీఆర్ బాటలోనే నడిచి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు లక్ష్మయ్య, జనార్ధన్‌యాదవ్, పి.నవీన్, నారాయణ, హేమలత వినోద్, సంతోష్, రాజు, నారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వివాదం.. యువకుడిపై దాడి

చికిత్స పొందుతూ మృతి

నాగోలు: బోనాల సందర్భంగా జరిగిన వివాదంలో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఓ యువకుడు చిక్సిత పొందుతూ మృతి చెందాడు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మన్సూరాబాద్, వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన పుట్టా సంజయ్ (19) ఈనెల 19న ఇంటి వద్ద ఉన్న సంజయ్‌ను తన మిత్రుడు నాగరాజు ఇంటికి తీసుకెళ్లాడు. బోనాల పండగ ఉండటంతో అందరూ కలిసి పార్టీ చేసుకున్నారు. రాత్రి సమయంలో మద్యం తాగి పుట్టా రవి.. సంజయ్‌ను అతడి ఇంటికి తీసుకొచ్చాడు. సంజయ్ తండ్రి శ్రీనివాస్.. ఏం జరిగిందని అడగ్గా.. అందరం కలిసి పార్టీ చేసుకున్నామని, సంజయ్ మద్యం మత్తులో ఉన్నాడని చెప్పి రవి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. 17వ తేదీన సంజయ్ కళ్లు పూర్తిగా తెరిచికోవడంలేదు. కడుపు ఉబ్బరంగా ఉండటంతో వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని కామినేని ఆసుపత్రికి తరలించారు. సంజయ్‌ను పరీక్షించిన డాక్టర్లు.. ఎవరో పిడికిలితో అతడిని బలంగా కొట్టారని, తలపై తీవ్ర గాయమైందని తెలిపారు. దీంతో సంజయ్ తండ్రి ఎల్బీనగర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పుట్టా సంజయ్ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు పుట్టా రవిని ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు.

రిజర్వ్‌బ్యాంక్‌లో ఉద్యోగాల పేరిట టోకరా

- ఇద్దరిని అరెస్టు చేసిన వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చాదర్‌ఘాట్: రిజర్వ్ బ్యాంక్‌లో అటెండర్స్, క్లర్క్ పోస్టులు ఇప్పిస్తామని పలువురి వద్ద నుంచి రూ. 8 లక్షలు వసూలు చేసి నకిలీ జాబ్ ఆఫర్ లెటర్స్ ఇచ్చి మోసం చేసిన ఇద్దరిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. చాదర్‌ఘాట్ పోలీసుల కథనం ప్రకారం.. కర్నూల్ జిల్లాకు చెందిన సంజీవయ్య (42), టోలీచౌకికి చెందిన ఫిరోజ్ సులేమాన్ (52)లు రిజర్వ్‌బ్యాంక్ ఇండియా హైదరాబాద్‌లో క్లర్క్, అటెండర్ పోస్టులు ఇప్పిస్తామని ఏడుగురి వద్ద నుంచి రూ. 8 లక్షలు తీసుకొని జాబ్ ఆఫర్ లెటర్స్ అందజేశారు. వారు వాటిని తీసుకొని బ్యాంక్ వద్దకు వెళ్లగా, అవి నకిలీ ఆఫర్ లెటర్లు అని తేలింది. మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి నకిలీ ఆఫర్ లెటర్స్ స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు కిరణ్ పరారీలో ఉన్నాడని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు.

కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

నాగోలు: కాలనీల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక సీసీ కెమెరా 1000 మంది పోలీసులతో సమానమని నాగోలు పోలీస్ స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లు కాలనీ వాసులకు సూచించారు. ఆదివారం నాగోలు పోలీస్ స్టేషన్‌లో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వచ్చే వారంలో జరిగే బోనాల ఉత్సవాలు, రాబోయే గణేష్ ఉత్సవాలను అందరూ ప్రశాంత జరుపుకోవాలన్నారు. కాలనీల్లో ఎవరైనా డ్రగ్స్, గంజాయి, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లల కదిలికపై నిఘా పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, ఎస్‌ఐలు శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు దక్కేంత వరకు పోరాడతాం: బీజేపీ



బంజారా కాలనీలో గుడిసెవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు దక్కేంతవరకు పోరాడతామని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో సలీంనగర్ బంజారా కాలనీలో ఆదివారం కార్పొరేటర్ పర్యటించారు. గుడిసె వాసులతో మాట్లాడి వారి వివరాలు సేకరించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న ఇందిరాపార్కు వద్ద బీజేపీ చేపట్టనున్న మహాధర్నాకు అందరూ తరలి రావాలని కోరారు. మోదీ సర్కార్ ఇళ్ల నిర్మాణం కోసం మంజూరు చేసిన నిధులను దారి మళ్లించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసగిస్తోందని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. నాయకులు గణేష్, పరుశ్‌రామ్, వంశీ, మల్లేష్, దినేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వాలి: లింగాల

సైదాబాద్: అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఆయన బీజేపీ నాయకులతో కలిసి ఆదివారం మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని పిల్లిగుడిసెలు, బ్రహ్మానందనగర్ కాలనీల్లో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల సర్వే నిర్వహించి వారి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా హరిగౌడ్ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిదన్నరేళ్లు అయినా నిరుపేదలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని విమర్శించారు.పేదలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

భవిష్యనిధి ఖాతాలపై ఉపాధ్యాయుల భయాందోళన: ఎస్టీయూ

పాక్షిక ఉపసంహారణకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి

వనస్థలిపురం: భవిష్య నిధి (జీపీఎఫ్) ఖాతాలలో డబ్బుల గురించి ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్తు పాండు రంగారెడ్డి, పుట్టపాక ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 2004కు ముందు నియామకమైన ఉపాధ్యాయుల జీతాలలో కొంత మొత్తం భవిష్యత్ అవసరాల కోసం జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే జీపీఎఫ్‌లో జమ చేసుకుంటారని తెలిపారు. ఆ డబ్బులు తమ ఖాతాలలో జమ అవుతున్న విషయాన్ని గతంలో ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో చూసుకునేవారని, ఈ మధ్య కాలంలో ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో తమ ఖాతాలలో సరిగ్గా జమ అవుతున్నాయో లేదో తెలియడం లేదని వారు పేర్కొన్నారు. నూతన జిల్లాల వారీగా ఉపాధ్యాయుల విభజన జరిగినప్పటికీ జీపీఎఫ్ ఖాతాల విభజన ఇంకా జరగకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. నూతన జిల్లాలకు జీపీఎఫ్ ఖాతాల విభజనను సాకుగా చూపించి గత మూడు నెలలుగా పాక్షిక ఉపసంహరణ దరఖాస్తులు తీసుకోకపోవడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. తక్షణమే ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాక్షిక విరమణ నగదును త్వరగా ఇవ్వాలని, లేకపోతే ఉపాధ్యాయులతో జిల్లా పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లకు నివాళి



వనస్థలిపురంలో తిలక్, ఆజాద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వనస్థలిపురం: భారత స్వాతంత్రోద్యమంలో యువతకు మార్గదర్శకం వహించి, స్వాతంత్రం నా జన్మహక్కు అని నినదించిన బాలగంగాధర్ తిలక్, అతి చిన్న వయసులో దేశ స్వాతంత్రం కోసం తన ప్రాణాలు అర్పించిన చంద్రశేఖర్ ఆజాద్ నేటి యువతకు ఆదర్శమని బీజేపీ నాయకులు పోచంపల్లి గిరిధర్ అన్నారు. ఆదివారం బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బీరం శ్రీధర్, కాల్వ బాల్‌రాజ్, శ్రీధర్‌రావు, సురేష్‌బాబు, సతీష్, శ్రావణ్, ఆకాష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థం స్వాధీనం: ఒకరి అరెస్టు

చైతన్యపురి: చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న అంతర్రాష్ట డ్రగ్స్ సిండికేట్ గుట్టును పోలీసులు ఛేదించారు. భారీగా మత్తు మందును స్వాధీనం చేసుకుని రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం...ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు చైతన్యపురి పోలీసులతో కలిసి చైతన్యపురి లియోలక్స్ కార్‌సీట్ కవర్స్ షాప్ సమీపంలో నిషిద్ధ మత్తు పదార్థం కలిగిన రమేష్‌కుమార్ (33)ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చైతన్యపురి రామాలయం సమీపంలోని అతని ఇంట్లో సోదాలు చేయగా, 2.2 కేజీల నిషిద్ధ నార్కోటిక్ పదార్థం పాప్పీ స్ట్రా డ్రగ్, 2 కేజీల పాప్పీ స్ట్రా పౌడర్ (గసగసాల గడ్డితో చేసిన పొడి) దొరికింది. వీటితో పాటు ఒక బైక్, రూ.1700 నగదు, వేయింగ్ మిషన్, మిక్సర్ గ్రైండర్, రెండు సెల్‌ఫోన్లు మొత్తం రూ.15 లక్షల విలువ చేసే సామగ్రిని స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం చైతన్యపురి పోలీసులకు అప్పగించారు.

రాజస్థాన్ నుంచి నగరానికి మత్తు పదార్థం..

రమేష్ కుమార్ (33) రాజస్థాన్ నుంచి పదేళ్ల క్రితం హైదరాబాద్ నగరానికి వచ్చి నాగోల్ ప్రాంతంలో రాహుల్ స్టీల్ రైలింగ్ వర్క్స్ పేరుతో వ్యాపారం ప్రారంభించాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సులువుగా డబ్బు సంపాదించేందుకు నార్కోటిక్ డ్రగ్స్ అమ్మి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో రాజస్థాన్‌లోని చెన్నారాంతో పరిచయం ఏర్పడింది. అతడి నుంచి నిషేధిత మత్తు పదార్థం గసగసాల డ్రగ్‌ను కొనుగోలు చేసి అవసరమైన వారికి సరఫరా చేయటం ప్రారంభించాడు. చెన్నారాం నుంచి కిలో రూ.50 వేలకు కొనుగోలు చేసి రూ.4 లక్షలకు విక్రయించి రమేష్‌కుమార్ డబ్బు సంపాదిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు ఇద్దరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మరో నిందితుడు చెన్నారాం పరారీలో ఉన్నట్లు తెలిపారు.



నిందితుడి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి